క్లుప్తంగా

విద్యా ప్రమాణాల పెంపునకే మోడల్ ప్రైమరీ స్కూళ్లు



బదిలీపై పలమనేరు మండలంలోని చేరుతున్న ఉపాధ్యాయులు

పలమనేరు: విద్యా ప్రమాణాల పెంపునకే మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పలమనేరు ఎంఈఓ లీలారాణి అన్నారు. మండలానికి బదిలీపై వచ్చిన టీచర్ల నుంచి సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఆమె ఆర్డర్ కాపీలను అందుకుని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా మండలంలో 19 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ చెప్పారు. ప్రతి మోడల్ స్కూల్‌లో ఓ హెచ్‌ఎం, ప్రతి తరగతికి ఓ టీచర్ ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందుతున్న విద్యా సేవలను ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం చేసి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చేలా చూడాలని సూచించారు.

పెరుగుతున్న టమాట ధరలు



టమాటాలు

సదుం: పెరుగుతున్న టమాట ధరలు రైతులలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. సోమవారం పుంగనూరు మార్కెట్‌లో 10 కిలోలు గరిష్టంగా రూ.214, కనిష్టంగా రూ.187 పలికింది. ఆదివారం గరిష్టంగా రూ. 154 ధర పలికింది. నియోజకవర్గంలో సుమారు 9 వేల ఎకరాలలో టమాట సాగు చేస్తున్నారు. ఈసారి ఇతర రంగాలలో వారు సైతం టమాట సాగుపై మొగ్గు చూపడంతో విస్తీర్ణం భారీగా పెరిగింది. దిగుబడులు అధికం కావడంతో ధరలు గణనీయంగా పడిపోయాయి. లక్షలాది రూపాయలు వ్యయం చేసి సాగు చేసిన పంటకు రవాణా, కూలీలు సైతం గిట్టుబాటు కాకపోవడంతో కాయలు కోయకుండా పొలాలలోనే వదిలేశారు. దీంతో భారీగా నష్టపోయారు. ప్రస్తుతం ధరలు ఇలాగే మరింత పెరిగితే నష్టాల భారం తగ్గే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

సదుంలో భారీ వర్షం

సదుం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో సోమవారం సుమారు గంట పాటు గాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వేరుశనగ సాగుకు ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వర్షం మూలాన సదుంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

స్వర్ణాంధ్ర-2047పై టెలీ కాన్ఫరెన్స్



సీఎం టెలీ కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, ఎమ్మెల్యే

పలమనేరు: స్వర్ణాంధ్ర-2047పై సోమవారం అమరావతి నుంచి సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ కాన్ఫరెన్స్‌కు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డితోపాటు ఆర్డీఓ భవాని, నియోజకవర్గ స్పెషలాఫీసర్ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. పలమనేరు నియోజకవర్గ అభివృద్ధిపై యాక్షన్‌ప్లాన్ గురించి మాట్లాడారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి జబ్బు రోగులకు పరీక్షిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 55 మంది కంటి జబ్బు రోగులను పరీక్షించి 35 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని చెన్నైకి తరలించి, ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు గంగజాతర

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో మంగళవారం గంగజాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెపారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించిన తరువాత నడివీధిలో కొలువుదీర్చనున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేసి దర్శనం కల్పిస్తారన్నారు. బుధవారం సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహిస్తామన్నారు.

విత్తన కష్టాలు బాబూ..!

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వేరుశనగ సాగుకు మొగ్గుచూపారు. ఇప్పటికే పొలాలు దుక్కి దున్ని ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూశారు. కుప్పం మండలంలో ఒకట్రెండు రోజుల్లోనే చాలీచాలని విత్తనాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా విత్తనాల కోసం ప్రైవేటు దుకాణాలు, పక్క రాష్ట్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి కల్పించిందని రైతన్నలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో డిమాండ్ మేరకు విత్తనాలు సరఫరా చేస్తే, ప్రస్తుతం సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే విత్తనాలను డిమాండ్ మేరకు సరఫరా చేయడం లేదు. విత్తనాల కొరత పీడిస్తోంది. ఇక్కడే ఇలా ఉంటే ఇక జిల్లాలో విత్తన కష్టాలు ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

- అరకొరగా పంపిణీ..ఆందోళనలో రైతులు
- తమిళనాడుకు వెళ్లి అధిక ధరకు కొంటున్న రైతన్నలు
- తగ్గిన 2వేల క్వింటాళ్ల విత్తనాల సరఫరా
- అదనంగా విత్తనాలు కావాలని ఏఓల ప్రతిపాదనలు
- సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నా తప్పని అగచాట్లు



శాంతిపురం: విత్తనాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేరుశనగ విత్తనాల కోసం రైతులకు భంగపాటు తప్పలేదు. గత వారం నాలుగు మండలాల్లో కూటమి ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసింది. వేలల్లో అవసరమున్న వేరుశనగ విత్తన కాయల బస్తాలు వందల్లో రావడంతో రైతన్నల డిమాండ్‌కు తగినట్టు ఇవ్వలేని పరిస్థితి కలిగింది. వ్యవసాయ శాఖ విత్తనాల సరఫరాపై సమాచారం ఇవ్వడం, ఆపై పట్టాదారు పాసుపుస్తకాలతో పరుగులు తీసినా తీరా విత్తనాలు అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. అదనపు విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని, వచ్చాక పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నా అవి వస్తాయో, లేదో ? తెలియని పరిస్థితి రైతులను అనిశ్చితిలోకి నెట్టివేస్తోంది.

విత్తనాల పంపిణీ వివరాలు

మండలం	2024 (వైఎస్సార్ సీపీ పాలనలో)	2025 (ప్రస్తుత కూటమి పాలనలో)
కుప్పం	1325 క్వింటాళ్లు	850 క్వింటాళ్లు
రామకుప్పం	1680 క్వింటాళ్లు	1071 క్వింటాళ్లు
శాంతిపురం	2050 క్వింటాళ్లు	403 క్వింటాళ్లు
గుడుపల్లె	640 క్వింటాళ్లు	440 క్వింటాళ్లు

విత్తనాల కోసం రైతుల తిప్పలు

ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేయడం పరిపాటి. ఈ క్రమంలో విత్తనాల కోసం ఎదురుచూసి నిరాశే కలిగింది. దీంతో ప్రైవేటు ఏజెన్సీలు, ఎరువుల దుకాణాల వెంట రైతులు పడ్డారు. కుప్పం నుంచి భారీగా తమిళనాడు రాష్ట్రం కావేరిపట్టణం, నాట్రాంపల్లె, తిరుపత్తూరు, వేపనపల్లె ప్రాంతాలకు వెళ్లి విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కుప్పం ప్రాంత రైతులకు కలిగింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 2 వేల క్వింటాళ్ల బస్తాలు తక్కువ రావడంతో ఏం చేయలేకపోతున్నామని అధికారులు చేతులెత్తేశారు. రైతులకు చాలీచాలని విత్తనాలు ఇచ్చి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు మండిపడుతున్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

శాంతిపురం: ఎట్టకేలకు మండలంలో రాయితీపై వేరుశనగ విత్తన కాయల పంపిణీని సోమవారం అబకలదొడ్డి రైతు సేవా కేంద్రంలో టీడీపీ నాయకులు లాంఛనంగా ప్రారంభించారు. రైతులు ఇమిడాక్లోప్రిడ్ ద్రావణం, ఎం-45 పౌడర్‌తో విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి సూచించారు. ఏటా మే చివరి వారంలో మొదలయ్యే విత్తన పంపిణీ ఈ పర్యాయం ఆలస్యం కావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. 30 కిలోల వేరుశనగ విత్తనాలు రూ 1,674లకు రైతులకు ఇస్తున్నారు. మొత్తం 1,403 క్వింటాళ్ల విత్తనాలు మండలానికి చేరినా పంపిణీ మాత్రం ఆలస్యమైంది. గత ఏడాదితో పోల్చితే ఈ దఫా 647 క్వింటాళ్ల విత్తనాలు తక్కువగా వచ్చాయి. అప్పట్లో 2,050 క్వింటాళ్ల విత్తనపు వేరుశనగ కాయలు వచ్చాయి.

కర్ణాటకలో ఎక్కువ రేటుకు తెచ్చుకున్నా



ఈ ఏడాది ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలు సరిపోవడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచక కర్ణాటక రాష్ట్రం బంగారుపేట, కోలారుకు వెళ్లి తీసుకొచ్చాం. క్వింటాల్ రూ.2వేలు అని చెప్పారు. విధిలేక కొన్నాం. మే నెల వస్తే వేరుశనగ ఈ ప్రాంతంలో సాగు చేయడం ఎక్కువ. చాలీచాలని వేరుశనగ విత్తనాలు ఇచ్చి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది.

- సి. మునిరత్నం, సంగనపల్లె, గుడుపల్లె మండలం

చాలా ఇబ్బంది



ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వకపోవడంతో వేరుశనగ సాగుకు ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తి స్థాయిలో పంపిణీ చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రైవేటు దుకాణాల్లో రేట్లు ఎక్కువ. తమిళనాడు, కర్ణాటక వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి కలిగింది. పంట సాగుకు విత్తనాలు అవసరం కదా మరి.

- పి.మునిరత్నం, బురుగులపల్లె, గుడుపల్లె మండలం

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



విజయ్‌కుమార్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

చౌడేపల్లె(పుంగనూరు): వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కిసాని విజయ్‌కుమార్‌రెడ్డి(67) సోమవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప గెరిగపల్లెకు వెళ్లారు. విజయకుమార్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, అక్కిసాని రాజారెడ్డిలను పెద్దిరెడ్డి పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, కొండేటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మా ఊరి 'షైనింగ్ స్టార్స్' వీరే..!

- చిత్తూరులో పురస్కారాలు ప్రదానం చేసిన కలెక్టర్



సదుం: పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

సదుం: మండలంలో ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. టెన్త్‌లో ప్రతిభ చాటిన సుదర్శన్, వినయ్, ధనుశ్, విష్ణువర్ధన్, సైదూసాబ్ సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారాలు స్వీకరించారు. ఈ ఐదుగురిలో నలుగురు ఎంజేపీ కళాశాల విద్యార్థులు ఉండడంతో వారిని ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు.

రొంపిచెర్ల నుంచి..

రొంపిచెర్ల: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు జిల్లా కలెక్టర్ నుంచి షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. ఆదర్శ పాఠశాల నుంచి భరత్ కుమార్ నాయుడు (578 మార్కులు, వీణావాణి(556), రిషీత (586), బాలిక ఉన్నత పాఠశాల నుంచి జోయో (565), కస్తూర్బా గురుకుల పాఠశాల నుంచి లలిత (536) మార్కులు సాధించి అవార్డులకు ఎంపికవడం విదితమే. వీరంతా అవార్డులు అందుకోవడంపై ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరళ, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

కుప్పం నుంచి..

కుప్పం: కుప్పం ప్రభుత్వం వృత్తి విద్యా కళాశాలలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చిత్తూరులో ప్రదానం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లలితారాణి 980 మార్కులు, సుస్మిత 976 మార్కులు సాధించారు. వారికి రూ.20వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని రిషీత



కుప్పం: ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్

విశ్రాంత ఉద్యోగుల ఆందోళన



బకాయిలు చెల్లించాలని నినదిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెండింగ్ డీఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్

పలమనేరు: పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు గురురాజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయం వద్ద సభ్యులతో కలసి సోమవారం ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లుగా ప్రభుత్వాలు బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. ఇక మృతి చెందిన విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు సైతం వీటి కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. ఎన్నికల్లో కూటమి గెలుపులో ఉపాధ్యాయ, ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ పాత్ర ఎంతో ఉందని చెప్పిన సీఎం చంద్రబాబు బకాయిలను విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు గౌస్, కృష్ణమూర్తి, ఆర్ముగం, మోహన్‌గౌడు, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు పోలీసుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

బంగారుపాళెం: ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధనలు పాటించి ట్రాక్టర్లు నడపాలని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ ప్రసాద్ అన్నారు. స్థానిక మామిడి మార్కెట్ యార్డులో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్సులు, వెహికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ట్రాక్టర్లను వేగంగా నడపరాదని హెచ్చరించారు. ఓవర్‌లోడుతో వెళ్లరాదని, ట్రాక్టర్‌లో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. హైవేలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ట్రాక్టర్‌కు ముందు, వెనుక రేడియం స్టిక్కర్స్ అతికించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ సారథి, పీసీలు ద్వారక, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సదుంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



పలమనేరు: యోగాపై చేస్తున్న అవగాహన ర్యాలీ

సదుం: దైనందిన జీవితంలో యోగాసనాలు వేయడం ఒక వ్యాపకంగా మలచుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక బస్టాండు నుంచి పెట్రోల్ బంక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ, డాక్టర్ గి రీశా, ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి, ఎంఈఓ-2 దామోదర, ఏపీ ఎంహరిప్రసాద్, నీలకంఠ,మహిళాసంఘసభ్యులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: ప్రతి ఒక్కరూ యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం పట్టణంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకర సమాజం కోసం ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నాలుగు దశల్లో నిర్వహిస్తోందని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ బాలసుందరం, పురపాలక, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



రైలు లోపల తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో రైల్వే పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం పలు రైళ్లు, ప్లాట్‌ఫాం, బుకింగ్ ఆఫీస్, పార్శిల్ సెంటర్, వెయిటింగ్ రూమ్‌లో తనిఖీ చేశారు. ఇకమీదట ప్రతిరోజూ తనిఖీలు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గోడపై గీయించిన శివుడిరూపం తొలగింపు



పాలంతోపు వాటర్ ప్లాంట్ గోడపై వేసిన శివ రూపం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం పాలంతోపు గ్రామంలోని తాగునీటి వాటర్ ప్లాంట్ గోడపై వేసిన ఆది యోగి శివరూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని సర్పంచ్ పాపమ్మాల్ సోమవారం బీఎన్‌ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటర్‌ప్లాంట్ వద్ద కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నామని, ఈ ప్లాంట్‌కు వెళ్లే దారిలో శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో సర్పంచ్ ఇటీవల శివుడి ప్రతిమను గోడపై గీయించారు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు ఈ రూపాన్ని తెల్లరంగు పెయింటింగ్‌తో చెరిపేశారని, నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.



తొలగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

ఇది టీడీపీ దిగజారుడు రాజకీయం

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల సాక్షి టీవీ చర్చావేదికలో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు మాటలను జగనన్నకు ఆపాదించడం తగదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షాయణి హితవు పలికారు. ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం దిగజారుడుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భారతమ్మకు సంబంధమే లేని అంశాన్ని పట్టుకొని ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఎల్లోమీడియాలో నిత్యం ఎన్నో అనుచిత వ్యాఖ్యలు చేయించిన జర్నలిస్టులు, నాయకులతో హోంమంత్రి అనిత క్షమాపణలు చెప్పించగలరా? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ పోస్టింగ్‌లు చేయించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు. మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు పెరుగుతున్నట్లు ప్రభుత్వమే అసెంబ్లీ వేదికగా అంగీకరించిందని గుర్తుచేశారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే వినతులు, సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు బాధితులు వారి సమస్యలను కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు రేపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 9న జరగాల్సిన ఈ లెక్కింపు 11వతేదీకి వాయిదా పడిందని, ఆలయ సిబ్బంది, అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.